క్లుప్తంగా

రామకృష్ణాచార్యులకు సన్మానం



ముత్తుకూరు : శ్రీహయగ్రీవ విఖనస జయంతి సందర్భంగా ప్రకాశం జిల్లా వైఖానస సంఘం ఆధ్వర్యంలో సోమవారం ముత్తుకూరుకు చెందిన సంస్కృత అధ్యాపకుడు నారాయణం ప్రసన్న రామకృష్ణాచార్యులను విశిష్ట సేవా పురస్కారంతో సత్కరించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు పరాంకుశం కేశవాచార్యులు, కార్యదర్శి మరుత్‌కుమార్ ఆత్రేయ తదితరులు రామకృష్ణాచార్యుల సేవలను కొనియాడారు.

నేటి నుంచి పశువులకు టీకాలు

ఇందుకూరుపేట : ఈనెల 20వ తేదీ నుంచి సెప్టెంబర్ 19వ తేదీ వరకు నెలరోజుల పాటు పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేస్తామని, పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని పశుసంవర్ధకశాఖ ఏడీ డాక్టర్ మురళీకృష్ణ సోమవారం కోరారు. జాతీయ పశు వ్యాధి నివారణ కార్యక్రమంలో భాగంగా అందిస్తున్న టీకాలను పశువులకు వేయించి గాలికుంటు వ్యాధి నుంచి కాపాడుకోవాలని ఏడీ కోరారు.

ప్రజా సమస్యలను వేగంగా పరిష్కరించాలి

- ఎస్ఈ సంపత్‌కుమార్

నెల్లూరు(బారకాసు) : సమస్యల పరిష్కారంపై ప్రజలు ఇస్తున్న అర్జీలను వేగంగా పరిష్కరించాలని కార్పొరేషన్ సూపరింటెండెంట్ ఇంజినీర్ సంపత్‌కుమార్ వివిధ శాఖల అధికారులను ఆదేశించారు. నగరపాలక సంస్థ కార్యాలయ ఆవరణలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో సోమవారం ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ సమస్యను బట్టి అవసరమైతే విభాగాధిపతులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలని చెప్పారు. ప్రజల నుంచి అందిన అర్జీలను సమగ్రంగా పరిష్కరించి, పునరావృతం కాకుండా చూడాలని ఆదేశించారు. పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, రోడ్ల ఆక్రమణ వంటి సమస్యల పరిష్కారం కోసం ప్రజలు ఎస్ఈ కార్యాలయానికి వస్తున్నారని, వాటిని స్థానికంగానే పరిష్కరించాలని తెలిపారు.

14 అర్జీల స్వీకరణ

వివిధ సమస్యలపై ప్రజల నుంచి 14 అర్జీలు అందాయని ఎస్ఈ తెలిపారు. ఇందులో ఇంజినీరింగ్ విభాగానికి 6, టౌన్‌ప్లానింగ్ విభాగానికి 2, పబ్లిక్ హెల్త్ విభాగానికి 2, హౌసింగ్ విభాగానికి 4 చొప్పున ఫిర్యాదులు అందాయని పేర్కొన్నారు. వాటిని నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో సిటీ ప్లానర్ దేవీకుమారి, మేనేజర్ ఇనాయతుల్లా, టీపీఓ దశయ్యతో పాటు పలు విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

- ఐదో రోజుకు జూడాల సమ్మె

నెల్లూరు(అర్బన్): కోల్‌కతాలోని ఆర్జీ కర్ మెడికల్ కళాశాల మహిళా డాక్టర్‌పై హత్యాచారం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని, అప్పటివరకు తమ పోరాటం ఆగదని జూనియర్ డాక్టర్లు ప్రకటించారు. జూడాలు చేస్తున్న సమ్మె సోమవారానికి ఐదో రోజుకు చేరుకుంది. ఈ మేరకు వారు నగరంలోని పెద్దాస్పత్రిలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారికి ఆస్పత్రి రెగ్యులర్ డాక్టర్స్ అసోసియేషన్ నాయకుడు, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కాలేషాబాషా మద్దతు ప్రకటించి, మాట్లాడారు. డాక్టర్లకు రక్షణ కల్పించకుండా రోగులకు వైద్యం చేయాలని కోరడం సమంజసం కాదన్నారు. విధుల్లో ఉన్న డాక్టర్లపై దాడులు జరగకుండా ప్రభుత్వాలు కఠిన చట్టాలు చేయాలని డిమాండ్ చేశారు. జూడాల అసోసియేషన్ అధ్యక్షుడు జునైద్ అలీ అహ్మద్ మాట్లాడుతూ ప్రభుత్వం స్పందించి తమకు న్యాయం చేస్తే తక్షణమే విధుల్లో చేరుతామని స్పష్టం చేశారు. తమ ఆందోళనలపై రాజకీయ నాయకులు స్పందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమానికి జనవిజ్ఞాన వేదిక ప్రధాన కార్యదర్శి డాక్టర్ శ్రీనునాయక్, విద్యాచరణ్ మద్దతు ప్రకటించారు.

సమ్మెతో రోగుల అవస్థలు

జూడాల సమ్మెతో పెద్దాస్పత్రిలో రోగులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. ఆస్పత్రిలోని 195 మంది జూనియర్ డాక్టర్లు, మరో 25 మంది వరకు పీజీ డాక్టర్లు సమ్మె బాట పట్టడంతో రోగులకు సకాలంలో వైద్యసేవలందడం లేదు. అత్యవసరం కాని ఆపరేషన్లు, చిన్న శస్త్ర చికిత్సలు వాయిదా వేస్తున్నారు.

కఠిన చట్టాలు చేయాలి

నెల్లూరు (టౌన్) : కోల్‌కతాలో మహిళా డాక్టర్‌పై హత్యాచారానికి పాల్పడిన నిందితులకు శిక్ష పడేలా చట్టాలు చేయాలని విద్యార్థి యువజన సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక కరెంటాఫీసు సెంటర్ నుంచి మెడికల్ కళాశాల వరకు సోమవారం విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం వైద్య విద్యార్థులకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చట్టాలు ఎన్ని ఉన్నా ఆడపిల్లలకు భద్రత లేకుండా పోతోందన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శి నరేంద్ర, శ్రీహర్ష, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి మస్తాన్‌షరీఫ్, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి నరసింహ, రమణ, నాయకులు చరణ్, జీవన్, విష్ణు, పవన్, యశ్వంత్, ప్రశాంత్, చైతన్య, సాయి, నరసింహ, ఆల్తాఫ్ తదితరులు పాల్గొన్నారు.

పూల ధరలకు రెక్కలు

- శ్రావణ మాసం, పెళ్లిళ్ల ఎఫెక్ట్
- పూజలు, గృహప్రవేశాలు కూడా..
- కార్తీక మాసంలో ఇదే పరిస్థితి
- మండల కేంద్రాల్లో ధరలు పైపైకి

పూల ధరలు (కిలో)	
చామంతి	రూ.300
బంతిపూలు	రూ.100
రోజాపూలు	రూ.250
మల్లెపూలు	రూ.180
కనకాంబరం	రూ.400
సంపంగి	రూ.150



పొదలకూరులోని పూల దుకాణాలు

పొదలకూరు : శుభకార్యాలకు వివిధ రకాల పూలు ఉండాల్సిందే. పూలంటే మహిళలకు మహా ప్రీతి. అంతేకాక భక్తుడికి భగవంతుడికి అనుసంధానం కూడా పువ్వులే. ఒక్కో దేవుడిని ఒక్కో రకం పూలతో కూడా భక్తులు అభిషేకిస్తుంటారు. పెళ్లిల్లు, గృహప్రవేశాలు, ఇతర పూజా కార్యక్రమాలకు వివిధ రకాల పూలు అవసరమవుతాయి. ఈ నేపథ్యంలో శ్రావణ మాసం నుంచి పెళ్లిల్లు ప్రారంభమైన క్రమంలో పూల ధరలు ఆదరిపోతున్నాయంటున్నారు. జిల్లా కేంద్రం నెల్లూరులో ఒక మోస్తరుగా ధరలు ఉండగా మండల కేంద్రాల్లో ధరలు అమాంతం పెంచేసి అమ్ముతున్నారు. పూల ధరలపై ఆంక్షలు లేకపోవడంతో ఎవరి ఇష్టం మేరకు వారు అధిక ధరలకు విక్రయిస్తున్నారు. పొదలకూరు పంచాయతీ బస్టాండ్ ప్రాంతంలో పూల దుకాణాలు చాలానే ఉన్నాయి. ఇక్కడ ప్రతి నిత్యం వ్యాపారులు పోటీపడి అమ్మకాలు సాగిస్తుంటారు. విడిపూలు, మాలలు అమ్మడంతో పాటు కొందరు ప్రత్యేక కార్యక్రమాల్లో పూల అలంకరణలకు కూడా వీటిని కొనుగోలు చేస్తుంటారు. వివాహాల్లో పూల డెకరేషన్‌కు ఓ ప్రత్యేకత ఉంటుంది. ఈ అలంకరణకు మండపాల యజమానులు రూ.లక్షల్లో చార్జి చేస్తుంటారు. ఫలితంగా పూల ధరలు పైపైకి చేరుకుంటున్నాయి. సెప్టెంబర్‌లో వినాయక చవితి, అక్టోబర్‌లో విజయదశమి, దీపావళి పండగలు, నవంబర్ ప్రారంభంలో కార్తీక మాసం ఉండడం వల్ల పూలకు డిమాండ్ పెరుగుతోంది. ఫలితంగా ఇప్పట్లో పూల ధరలు తగ్గుముఖం పట్టే అవకాశం లేదు.

తగ్గుతున్న పూల సాగు

సాధారణంగా పూల సాగు చిన్న కమతాల్లోనే రైతులు చేస్తుంటారు. ఎకరాలకు ఎకరాల్లో పూల సాగు చేసే రైతులు పెద్దగా ఉండరు. పందిళ్లు, పూల మొక్కల రక్షణ కోసం పాలీ హౌస్‌ల నిర్మాణం వ్యయంతో కూడుకున్న పని కావడంతో రైతులు పూలసాగుపై ఆసక్తి చూపరు. పూలతోటల పెంపకం ఉద్యాన పంటల కిందకు వస్తున్నందున ఉద్యానశాఖ వారు ఈ సాగును ప్రోత్సహించేందుకు సబ్సిడీలను కూడా కల్పిస్తోంది. ఒక హెక్టార్‌లో పూల సాగు చేస్తే ఉద్యానశాఖ నుంచి రూ.16 వేలు సబ్సిడీ లభిస్తుంది. అయితే చెన్నై, బెంగళూరు నుంచి పూలు దిగుమతి అవుతున్న నేపథ్యంలో సీజన్లో ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. మండలంలోని నల్లపాళెం, తాటిపర్తి, మర్రిపల్లి తదితర గ్రామీణ ప్రాంతాల్లో పూలసాగు ఉంది. ఇక్కడ చామంతి, సంపంగి సాగు మాత్రమే చేస్తున్నారు. మర్రిపల్లిలో రైతు ఇటీవల పాలీహౌస్ (పూలతోట)ను తొలగించారు.

పూల ధరలు పెరిగాయ్



పూల ధరలు బాగా పెరుగుతున్నాయి. వరలక్ష్మీ వ్రతం ఆచరించేందుకు పూలు కొనుగోలు చేస్తే విపరీతంగా ధరలు ఉన్నాయి. శుభకార్యాలకు పూల మాలలు, విడి పూలు కొనుగోలు చేయాలంటే ధరలు పైస్థాయిలో ఉంటున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లోని ఇళ్లలో పూల మొక్కలు పెంచుకోవడం మేలు.

– వై.ప్రశాంతి, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్, పొదలకూరు



వివిధ రకాల పూలమాలలు



మర్రిపల్లి వద్ద పాలీహౌస్‌లో చామంతి సాగు (ఫైల్)

నేత్రపర్వం.. శ్రీనివాసుని కల్యాణం

పొదలకూరు : పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్‌లో ఉన్న శ్రీలక్ష్మీగోదా సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో స్వామి, అమ్మవార్ల కల్యాణం సోమవారం నేత్రపర్వంగా జరిగింది. ఉభయకర్తలుగా లింగంపల్లి గ్రామానికి చెందిన అనమాన వెంకటరమణారెడ్డి-వసుంధర దంపతులు వ్యవహరించారు. వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య స్వామి అమ్మవార్ల కల్యాణం వైభవంగా నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కల్యాణాన్ని వీక్షించారు. అనంతరం నిర్వాహకులు భక్తులకు అన్నప్రసాదాలను అందజేశారు. ప్రత్యేక పూజల్లో దేవస్థానం నిర్వాహకులు వాకాటి శ్రీనివాసులురెడ్డి, ఎం.శ్యామ్‌ప్రసాద్, కొమ్మి వేణుగోపాల్, దాసరి శ్రీనివాసులు, చొప్పా వెంకటేశ్వర్లు, మురళి తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేకాలంకరణలో స్వామి అమ్మవార్లు

రక్తహీనత సమస్యను అధిగమించాలి

ఇందుకూరుపేట : గర్భిణులు తగిన పౌష్టికాహారం తీసుకుని అనీమియా, రక్తహీనత సమస్యలను అధిగమించాలని జగదేవిపేట పీహెచ్‌సీ హెల్త్ఎడ్యుకేటర్ సుధాకర్‌రావు అన్నారు. మండలంలోని పల్లిపాడులో గర్భిణులు, బాలింతల నివాసాలకు సోమవారం ఆయన వెళ్లి పరీక్షించి వారికి తగిన సూచనలు చేశారు. మనకు అందుబాటులో తక్కువ ఖర్చుతో లభించే పౌష్టికాహార పదార్థాల గురించి వివరించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే పోషకాహారాన్ని తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక పాఠశాల ఉపాధ్యాయులు, వైద్యారోగ్య సిబ్బంది పాల్గొన్నారు



గర్భిణులకు సూచనలు ఇస్తున్న సుధాకర్‌రావు

నేటి నుంచి స్వామివారి విగ్రహ ప్రతిష్ట

వెంకటాచలం : మండలంలోని తిక్కవరప్పాడు గ్రామంలో అయ్యప్పనాయుడు స్వామి విగ్రహ ప్రతిష్ట మహాకుంభాభిషేక మహోత్సవాలు మంగళవారం నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్నారు. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం 7 గంటలకు గణపతి పూజ, పుణ్యాహవచనం, రక్షాబంధనం, దీక్షారాధనం, అఖండస్థాపన, సాయంత్రం 6.30 గంటలకు వేదపారాయణం, జలాధివాసం, అగ్నిప్రతిష్ఠ, వాస్తు హోమం తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నారు. బుధవారం ఉదయం 8 గంటలకు మంత్ర పారాయణం, అష్టగణపతి హోమం, నవగ్రహ హోమం, గ్రామదేవతల హోమం, సుదర్శన హోమం, రుద్ర హోమం, మధ్యాహ్నం 3 గంటలకు స్వామివారి ఊరేగింపు ఉంటుందన్నారు. చివరి రోజు గురువారం 8 గంటలకు అయ్యప్పనాయుడు స్వామి, మహాగణపతి, సుబ్రహ్మణ్య స్వామి విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమాలను శతాధిక ప్రతిష్టాపనాచార్యులు బ్రహ్మశ్రీ గాడేపల్లి ప్రశాంత్‌శర్మ చేతుల మీదుగా నిర్వహించనున్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం కార్యక్రమం ఉంటుందని ఆలయ నిర్వాహకులు తెలిపారు.



నూతనంగా నిర్మించిన అయ్యప్పనాయుడు స్వామి ఆలయం

వైఎస్సార్‌సీపీ నేతకు పరామర్శ

కొడవలూరు : మండలంలోని యల్లాయపాళేనికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు షేక్ మహబూబ్ బాషా కుమారుడు అబ్దుల్ సమద్ ఇటీవల టీడీపీ కార్యకర్తల చేతిలో గాయపడ్డారు. ఈ క్రమంలో మాజీ ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి సోమవారం యల్లాయపాళెంలోని మహబూబ్ బాషా నివాసానికి వెళ్లి వారిని పరామర్శించారు. ఆయన వెంట డీసీఎమ్మెస్ మాజీ చైర్మన్ వీరి చలపతిరావు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గంధం వెంకటశేషయ్య, ఎంపీటీసీ కేతిరెడ్డి వెంకటరమణారెడ్డి, నాయకులు అడపాల మోహనకృష్ణ, జడ్డా అమరావతి, దేవిరెడ్డి సాయిరెడ్డి, యుగంధర్‌రెడ్డి, తాటిపర్తి భాస్కర్, చక్కా మనోహర్, రామిరెడ్డి రాజేష్‌రెడ్డి, జడ్డా సాయి, షేక్ ఆసిఫ్ ఉన్నారు.



పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

ప్రమాదాలకు కేరాఫ్‌గా మలుపులు



మల్లికార్జునపురం సమీపంలో ప్రమాదకరంగా ఉన్న మలుపు



మాచర్లవారిపాళెం సమీపంలో సూచిక బోర్డు లేని మలుపు

తోటపల్లిగూడూరు : మండలంలోని ఆర్అండ్‌బీ రహదారిలో ఉన్న పలు మలుపులు ప్రమాదాలకు కేరాఫ్‌గా మారాయి. ముఖ్యంగా తోటపల్లిగూడూరు-సాలిపేట ఆర్అండ్‌బీ రహదారిలో మాచర్లవారిపాళెం, మల్లికార్జునపురం, వరకవిపూడి ప్రాంతాల్లో ఉన్న పలు మలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. అలాగే కోడూరు-సాలిపేట మార్గంలో ఉన్న పలు పలుపులు ప్రమాదాలకు నిలయంగా మారిపోయాయి. ఈ మలుపుల సమీపంలో ఎలాంటి స్పీడ్ బ్రేకర్లు, హెచ్చరిక బోర్డులు లేవు. ఎదురెదురుగా వచ్చే వాహనాలు దగ్గరకు వచ్చేంత వరకు ఒకదానికొకటి కనిపించవు. ఈ క్రమంలో ఆయా మార్గాల్లో తరచూ రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకొంటున్నాయి. గడిచిన ఏడాది కాలంగా ఆయా మార్గాల్లో అనేక రోడ్డు ప్రమాదాలు నెలకొన్నా సంబంధిత ఆర్అండ్‌బీ అధికారులు ఎలాంటి రక్షణ చర్యలు చేపట్టలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రమాదాలకు నిలయంగా మారిన మలుపుల వద్ద కనీసం స్పీడ్ బ్రేకర్లు లేదా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి ప్రమాదాలను నియంత్రించాల్సి ఉంది.

వక్ఫ్ చట్ట సవరణ ఆపాలి

ముత్తుకూరు : పార్లమెంట్‌లో వక్ఫ్ చట్ట సవరణను ఆపాలని మండల ఆవాజ్ కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు మండల కార్యదర్శి మస్తాన్ షా తహసీల్దార్ బాలకృష్ణారెడ్డికి ఆయన కార్యాలయంలో సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పేద ముస్లింలకు అనుకూలంగా లేని ఈ బిల్లును ఇటీవల పార్లమెంటులో ప్రవేశపెట్టారని గుర్తుచేశారు. మత స్వేచ్ఛకు వ్యతిరేకంగా ఉన్న చట్టాన్ని కేంద్రం వెంటనే వెనక్కు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ముత్తుకూరు మండలంలో వక్ఫ్ భూములను రక్షించాలని కోరారు. షేక్ సిరాజ్, షేక్ మీరా సాహెబ్, షేక్ మౌలా తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆవాజ్ కమిటీ సభ్యులు

వ్యాయామంపై అవగాహన అవసరం

కొడవలూరు : వ్యాయామం ఆవశ్యకతపై విద్యార్థుల్లో అవగాహన అవసరమని యల్లాయపాళెం హైస్కూల్ హెచ్ఎం ఎ.మోహన రామలింగయ్య సూచించారు. మండలంలోని యల్లాయపాళెం హైస్కూల్‌లో కొడవలూరు, విడవలూరు మండలాల ఉన్నత పాఠశాలల ఫిజికల్ డైరెక్టర్‌లకు శిక్షణా కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. వివిధ రకాల క్రీడలు, వ్యాయా మం వల్ల కలిగే ప్రయోజనాలను విద్యార్థులకు తెలియజేయాలన్నారు. దీని ద్వారా వాటిపై ఆసక్తి కనబరిచేలా చేయాలన్నారు. కార్యక్రమానికి మల్లికాదేవి, హజరత్తయ్య, దిలీప్‌కుమార్, తిరుమలయ్య రిసోర్స్ పర్సన్లుగా వ్యవహరించారు.

ఘనంగా రాఖీ పౌర్ణమి



మనుబోలు : కాకాణికి రాఖీ కడుతున్న వజ్రమ్మ



కోవూరు : ప్రసన్నకు రాఖీ కడుతున్న మహిళలు



వెంకటాచలం : విద్యార్థులకు రాఖీలు కడుతున్న విద్యార్థినులు



పొదలకూరు : కాకాణికి రాఖీ కడుతున్న లక్ష్మీకల్యాణి



ముత్తుకూరు : కాకాణికి రాఖీ కడుతున్న ఎంపీపీ సుగుణ

వెంకటాచలం : ఆత్మీయత, ప్రేమానురాగాలకు ప్రతీకగా నిలిచే రాఖీ పౌర్ణమి పండగను వెంకటాచలం మండలంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలతో పాటు, గ్రామాల్లోనూ రాఖీ పండగ సందర్భంగా అన్నకు చెల్లి, తమ్ముడికి అక్క రాఖీలు కట్టారు. సర్వేపల్లిలోని ఎస్సార్‌కే ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో కరస్పాండెంట్ దినేష్‌రెడ్డి విద్యార్థినుల చేత విద్యార్థులకు రాఖీలు కట్టించి రక్షాబంధన్ విశిష్టతను తెలియజేశారు.

ప్రసన్నకు రాఖీ కట్టిన మహిళలు

కోవూరు : మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డికి కోవూరు నియోజకవర్గంలోని పలువురు మహిళలు రాఖీ పౌర్ణమి సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేశారు. నెల్లూరులోని ఆయన నివాసంలో వారు సోమవారం రాఖీలు కట్టారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు శ్రీలత, సర్పంచ్ యేడెం లక్ష్మీకుమారి, సర్పంచ్ దామెర్ల ప్రమీలమ్మ, ఎంపీటీసీ సభ్యులు రాజేశ్వరి, సుప్రజ, పర్వీన్, వార్డు సభ్యులు సుప్రజ, జ్యోతి, మాధవి తదితరులు పాల్గొన్నారు.

కాకాణికి రాఖీ కట్టిన మహిళా నేతలు

మనుబోలు : రాఖీ పౌర్ణిమను పురస్కరించుకుని మనుబోలు మండల పరిషత్ అధ్యక్షురాలు గుండాల వజ్రమ్మ మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి సోమవారం రాఖీ కట్టారు. నెల్లూరులోని కాకాణి నివాసంలో ఆయన్ను కలిసిన వజ్రమ్మ రాఖీ కట్టి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత పదేళ్లుగా ఓ అన్నలా కాకాణి తమకు అన్నివేళలా అండగా నిలిచారన్నారు.

- పొదలకూరు : రాఖీ పౌర్ణమి సందర్భంగా మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి పొదలకూరు బిట్-3 ఎంపీటీసీ సభ్యురాలు గంగవరపు లక్ష్మీకల్యాణి సోమవారం రక్షాబంధన్ కట్టారు. నెల్లూరులోని కాకాణి నివాసంలో రాఖీ కట్టి ఆయన ఆశీర్వాదం తీసుకున్నారు.
- ముత్తుకూరు : స్థానిక ఎంపీపీ గండవరం సుగుణ నెల్లూరులోని క్యాంపు కార్యాలయంలో మాజీ మంత్రి కాకాణి గోవర్ధనరెడ్డిని కలిసి రాఖీ కట్టారు. ఆయన ఆశీర్వాదం తీసుకున్నారు.

ఆధునిక పద్ధతుల్లో బోధన చేయాలి

- ఎంఈఓ అంకయ్య

కొడవలూరు : తరగతుల్లో ఆధునిక బోధనా పద్ధతులను అమలు చేయాలని ఎంఈఓ ఎస్.అంకయ్య సూచించారు. మండలంలోని నార్తురాజుపాళెం హైస్కూల్ ప్లస్‌లో ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ఉపాధ్యాయులకు మ్యాథ్స్, సైన్స్ సబ్జెక్టులపై సోమవారం శిక్షణ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన, మాట్లాడుతూ శిక్షణా తరగతుల్లో సబ్జెక్ట్ నిపుణులు వివిధ పాఠశాలల్లో అమలు చేసే ఆధునిక బోధనా పద్ధతులను వివరిస్తారన్నారు. చిత్ర ప్రదర్శనలు, కృత్యాలు, టిప్స్‌తో బోధనపై సమగ్రంగా వివరిస్తారని తెలిపారు. వీటిని అమలు చేయడం ద్వారా చిన్నారుల్లో విద్యా సామర్థ్యాలను పెంచవచ్చన్నారు. అదే విధంగా పాఠశాలల్లో విద్యార్థుల నమోదును గణనీయంగా పెంచాలని సూచించారు. పాఠశాల హెచ్ఎం డి.ఓబులేసు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి వై.అంకయ్య, ఏఎస్‌పీపీ.రెడ్డి రిసోర్స్ పర్సన్‌లుగా వ్యవహరించారు. కార్యక్రమంలో సీఆర్ఎంటీలు టీవీ సురేష్, లీలయ్య పాల్గొన్నారు.



ఉపాధ్యాయులకు సూచనలిస్తున్న ఎంఈఓ అంకయ్య

రోడ్డు దాటుతుండగా కారు ఢీ

- యువకుడికి తీవ్రగాయాలు

పొదలకూరు : రోడ్డు దాటుతుండగా కారు ఢీకొనడంతో యువకుడు తీవ్రంగా గాయపడిన ఘటన మండలంలోని నెల్లూరు మార్గం మరుపూరు గ్రామం వద్ద సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలు.. మరుపూరు గ్రామానికి చెందిన పి.డానియెల్ రోడ్డు దాటుతుండగా ఓ కారు వేగంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆయన తలకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు 108 అంబులెన్స్‌లో క్షతగాత్రుడిని నెల్లూరుకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



గాయపడిన డానియెల్